VICTORY

విక్టరీ

# శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రమ్



టీకా తాత్పర్య సహితం

VICTORY

VICTORY

# శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రమ్

(టీకా తాత్పర్య సహితం)


సంకలనం

పోలూరి కృష్ణకౌండిన్య



**విక్టరీ పబ్లిషర్స్**

డోర్. నెం. 30-17-3 A వారణాశివారి వీధి, సీతారాంపురం,

విజయవాడ- 520 002. ఫోన్ : 0866 - 2444156.

# విష్ణుసహస్రనామస్తోత్ర మహాత్మ్యం



*శాంతాకారం భుజగశయనం పద్మనాభం సురేశం*
*విశ్వాధారం గగన సదృశం మేఘవర్ణం శుభాంగం*
*లక్ష్మీకాంతం కమలనయం యోగి హృద్ధ్యానగమ్యం*
*వందే విష్ణుం భవభయహరం సర్వలోకైకనాథమ్*

**తాత్పర్యం :** శాంత స్వరూపుడైన వాడూ, ఆదిశేషుని మీద శయనించిన వాడూ, నాభిలో పద్మము కలవాడూ, దేవతలకు ప్రభువైన వాడూ, విశ్వానికి ఆధారమైన వాడూ, మేఘము వంటి మేనిరంగు కలవాడూ, పుణ్య ప్రదమైన శరీరం గల వాడూ, లక్ష్మీదేవికి భర్త అయిన వాడూ,పద్మముల వంటి కన్నులు కలవాడూ, యోగుల హృదయాలలో ధ్యాన రూపము గలవాడూ, సంసార భయాన్ని హరించే వాడూ, సమాస్తలోకాలకూ నాయకుడైన వాడూ ఐన విష్ణుదేవుని గూర్చి నమస్కరిస్తున్నాను.

నామరూపాత్మకమైన ప్రపంచాన్నంతటినీ సృష్టించి, అందులో ప్రతి అణువులోనూ, ప్రవేశించి ఉండేవాడు 'విష్ణువు'. అందువల్లనే ఆయనను 'విశ్వం' అన్నారు. 'విష్ణువు' అంటే 'సర్వత్రా వ్యాపించి ఉండేవాడు' అని అర్థం. ఈ యథార్థాన్నే 'ఈశావాప్య మిదం సర్వమ్' అనీ, 'సర్వ ఖలిద్వం బ్రహ్మ' అనీ ఉపనిషద్వాణి ఉద్ఘోషిస్తున్నది.

ఎన్నో కోట్లు జన్మలలో చేసుకున్న పుణ్య కర్మల ఫలంగా మనకు మానవ జన్మ లభించింది. ఈ మానవ జన్మలోనే మాధవుని చేరుకోవటానికి ప్రయత్నించాలి. జీవాత్మ, పరమాత్మతో చేరటానికి అనేక మార్గాలున్నాయి. వాటిలో విశిష్టమైనదీ, సులభమైనదీ 'భక్తి' మార్గం.

వాగ్రూపం ధరించిన భక్తినే 'స్తోత్రం' అంటారు. శ్రీ శంకర భగవత్పాదులు స్తోత్ర లక్షణాలను వివరిస్తూ.....

"నమస్కార స్తథాశీశ్చ సిద్ధాంతోక్తిః పరాక్రమః విభూతిః ప్రార్థనా చేతి షడ్విధం స్తోత్ర లక్షణమ్" అన్నారు. అంటే – నమస్కారం, ఆశీర్వాదం, దృఢాభిప్రాయ ప్రకటన, అనంతశక్తి నిరూపణ, దివ్యైశ్వర్య వివరణ, ప్రార్థన అనే ఆరు లక్షణాలను స్తోత్రం కలిగి ఉంటుంది. ఈ విధమైన లక్షణాలతో శోభించేది శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రమ్.

'శ్రీ విష్ణు సహస్రనామస్తోత్రమ్' అనే మహామంత్రం శ్రీ మన్మహా భారతంలో అను శాసన పర్వంలో ఉన్నది. దానిని సంభావించినవాడు వేదవ్యాస మహర్షిగా ప్రసిద్ధికెక్కిన శ్రీ కృష్ణద్వైపాయణుడు.

మహాభారత యుద్ధకాలంలో ఒకవంక కురు పితామహుడైన భీష్మాచార్యుడు ప్రాణోత్క్రమణ సమయానికి ఎదురుచూస్తూ అంపశయ్య మీద ఉన్నాడు. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే అయిన శ్రీ కృష్ణ దర్శనం కోసం తహతహలాడుతున్నాడు. మరొక వంక యుధిష్ఠరుడు తన రాజ్యకాంక్ష కారణంగా యుద్ధం జరిగిందనీ, తన గురువులు, బంధువులూ, మిత్రులూ అన్యాయంగా అందులో మరణించారనీ భావించి అమిత వేదనను అనుభవిస్తున్నాడు. పాప భీతితో కుమిలిపోతున్నాడు.

ఇదంతా గ్రహిస్తున్న శ్రీకృష్ణ భగవానుడు తన పరమభక్తుడైన భీష్మాచార్యునకూ, ధర్మమూర్తి అయిన యుధిష్ఠిరునకూ ఏక కాలంలో మనశ్శాంతి చేకూర్చాలని నిశ్చయించు కున్నాడు. ఆ కారణంగానే ధర్మరాజును తోడ్కొని భీష్మాచార్యుల వారి వద్దకు వెళ్ళాడు.

శ్రీకృష్ణుని ఆగమనానికి భీష్ముడు ఆనంద పరవశుడైనాడు. శ్రీ కృష్ణుని భక్త వాత్సల్యాన్ని అమితంగా ప్రశంసించాడు. ఆ తరువాత ఆయన ఆదేశానుసారం, ఆయన ప్రసాదించిన శక్తి ఆధారంగా పాండవాగ్రజునకు అనేక ధర్మాలను బోధించాడు. ధర్మరాజు ఆవేదనను ఉపశమింపజేయటానికి ప్రయత్నించాడు.

కాని ధర్మరాజుకు సంపూర్ణమైన సంతృప్తి కలుగలేదు. తన గురుదేవుడైన భీష్మాచార్యుల ద్వారా తెలుసుకోవలసిన 'అసలు విషయం' ఏదో మిగిలిఉన్నదన్న అభిప్రాయం ఆయనను బాధిస్తూనే ఉంది. ఆ కారణంగానే ధర్మజుడు సర్వధర్మజ్ఞుడైన భీష్మాచార్యుని 'ఆరు'ప్రశ్నలు అడిగాడు.

1. ***'కిమేకం దైవతం లోకే' :***
   ప్రపంచమంతటికీ ఏకైక ఆరాధ్య దేవత ఎవరు?

2. ***'కింవాప్యేకం పరాయణం' :***
   ప్రాణికోటికి ఏకైక పరమ లక్ష్యం ఏమిటి?

3. ***'స్తువంతః కం ప్రాప్నుయుః మానవా శుభం' :***
ఎవరిని  స్తుతించడం ద్వారా మానవులకు మేలు కలుగుతుంది.

4. ***'కమర్చంతః ప్రాప్నుయుః మానవా శుభం' :***
ఎవరిని అర్చించడం ద్వారా మానవులకు సుఖం,శాంతీ లభిస్తాయి?

5. ***కోధర్మః సర్వాధర్మణాం భవతః పరమోమతః :***
మీ అభిప్రాయంలో ధర్మాలన్నింటిలోకి విశిష్టమైన ధర్మం ఏమిటి?

6. ***'కిం జపన్ముచ్యతే జంతుః జన్మ సంసార బంధనాత్' :***
ఏ మంత్రాన్ని జపించటం ద్వారా ప్రాణికోటి జనన మరణరూపమైన సంసారం నుండి విడివడగలుగుతుంది?

వాటికి  సమాధానంగా భీష్మా  చార్యులవారు ఈ విధంగా చెప్పారు.

**మొదటి ప్రశ్న** : ప్రపంచమంతటికీ ఏకైక ఆరాధ్య దేవత ఎవరు?

**సమాధానం** : **'పవిత్రాణాం పవిత్రం యో మంగళానాం చ  మంగళం**
**దైవతం దేవతానాంచ భూతానాం యో ఽ(అ) వ్యయః పితా'**

**తాత్పర్యం** : పవిత్రమైన వాటన్నిటికి పవిత్రతను చేకూర్చే  పరమ పవిత్రుడూ, సర్వ శ్రేయాలకు మూలమైన వాడూ, దేవతలందరకూ దైవతమైనవాడూ, ప్రాణికోటికి తండ్రి అయిన శ్రీ మహావిష్ణువే ప్రపంచమంతటికీ ఏకైక దైవతం.

**రెండవ ప్రశ్న** : ప్రాణికోటికి ఏకైక పరమలక్ష్యం ఏమిటి?

**సమాధానం** : **పరమం యో మహత్తేజః పరమం యో మహత్తపః**
**పరమం యో మహద్బ్రహ్మ పరమం యః పరాయణమ్.**

**తాత్పర్యం** : పరమ తేజ స్వరూపుడూ, సర్వ నియామకుడూ, సర్వవ్యాపకుడూ, సర్వేశ్వరుడూ, పరమాత్మా అయిన శ్రీ మహావిష్ణువే ప్రాణికోటి అంతటికీ ఏకైక లక్ష్యం.

**మూడవ ప్రశ్న** : ఎవరిని స్తుతించడం ద్వారా మానవులకు మేలు కలుగుతుంది?

**సమాధానం** : **జగత్ప్రభుం దేవదేవం  అనంతం పురుషోత్తమం**
**స్తువన్నామసహస్రేణ పురుషః  సతతోత్థితః**

**తాత్పర్యం** : ముల్లోకాలకు ప్రభువూ, దేవతలకు కూడా  దైవతమైన వాడూ, ఆదిమధ్యాంత రహితుడూ అయిన పరమ పురుషుని, ఆయన యొక్క అనంత నామాల ద్వారా స్తోత్రం చేయటం వల్ల జీవులకు మేలు జరుగుతుంది.

**నాలుగవ ప్రశ్న** : ఎవరిని అర్చించటం ద్వారా మానవులకు సుఖం, శాంతీ లభిస్తాయి?

**సమాధానం** : **తమేవ చార్చయన్ నిత్యం భక్త్యా పురుషమవ్యయం**
**స్తువన్నామ సహస్రేణ పురుషః సతతోద్ధితః**

**తాత్పర్యం** : భక్తితో ఆ పరమ పురుషుని ధ్యానించటం ద్వారా, పూజించటం ద్వారా, సేవించటం ద్వారా మానవులకు సుఖం, శాంతీ లభిస్తాయి.

**ఐదవ ప్రశ్న** : మీ అభిప్రాయంలో ధర్మాలన్నింటిలోకి విశిష్టమైన ధర్మం ఏమిటి?

**సమాధానం** : **ఏషమే సర్వ ధర్మాణాం ధర్మోఽ ధిక తమోమతః**
**యద్భాక్త్యా పుండరీకాక్షం స్తవై రచ్చే న్నరః సదా'**

**తాత్పర్యం** : ఎవరైనా పుండరీకాక్షుడైన విష్ణువును సదా సభక్తికంగా స్తోత్రం చేసి, పూజించటమే సమస్త ధర్మాలకు మేలైన ధర్మమని నా అభిప్రాయం.

**ఆరవ ప్రశ్న** : ఏ మంత్రాన్ని జపించటం ద్వారా ప్రాణి కోటి జనన మరణరూపమైన సంసారం నుండి విముక్తమవుతుంది ?

**సమాధానం** : **అనాధినిధనం విష్ణుం సర్వలోక మహేశ్వరం**
**లోకాధ్యక్షం స్తువన్నిత్యం సర్వదుఃఖాతిగోభవేత్.**

**తాత్పర్యం** : జనన మరణాలకు అతీతుడూ, సర్వవ్యాపీ, విశ్వమంతటికీ ప్రభువూ, సర్వసాక్షి అయిన పరమాత్ముని అనంత నామాలను అనుదినం జపించటం ద్వారా మానవులు దుఃఖనివృత్తి చేసుకోగల్గుతారు.

ఈ విధంగా ధర్మరాజు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చిన తరువాత భీష్మాచార్యులవారు

**యాని నామాని గౌణాని విఖ్యాతాని మహాత్మనః**
**ఋషిభిః పరిగీతాని తాని వక్ష్యామి భూతయే**

**తాత్పర్యం** : ఏ నామాలు మహాత్ముడైన విష్ణువునకు గుణాలై ప్రసిద్ధి గాంచినవో? ఏ నామాలు మునుల చేత గానం చేయబడినవో? ఆ మహావిష్ణు సహస్ర నామాలను పురుషార్థాలు సిద్ధించటానికై నీకు చెప్తాను- అని ధర్మరాజునకు శ్రీ విష్ణు సహస్ర నామాలను వినిపించాడు.

**శ్రీ విష్ణు సహస్ర నామ మహామంత్ర జపం వల్ల కలిగే ప్రయోజనం ఏమిటి?**

ఈ ప్రశ్నకు కూడా వ్యాసమహర్షి సమాధానం చెప్పాడు.

***య ఇదం శ్రుణయాన్నిత్యం యశ్చాపిపరికీర్తయేత్ ।***
***నాశుభం ప్రాప్నుయాత్ సో ఽ (అ) ముత్రేహచమానవః ॥***

**తాత్పర్యం** : ఎవరు ఈ విష్ణు సహస్రనామాలను భక్తి, శ్రద్ధ లతో పఠిస్తుంటారో వారికి అశుభమనేది జరుగదు.

*వేదాంతగో బ్రాహ్మణస్యాత్ క్షత్రియో విజయీభవేత్*
*వైశ్యో ధన సమృద్ధస్స్యాత్ శూద్రః సుఖమవాప్నుయాత్.*

**తాత్పర్యం** : ఈ సహస్రనామ జపం వల్ల బ్రాహ్మణుడు బ్రహ్మజ్ఞాన సంపన్నుడవుతాడు. క్షత్రియుడు శత్రువులపై విజయం సాధిస్తాడు. వైశ్యుడు ధన సమృద్ధి కలవాడవుతాడు. శూద్రుడు సుఖమనుభవిస్తాడు.

*ధర్మార్థీ ప్రాప్నుయాత్ ధర్మ మర్ధార్థీచార్ధమాప్నుయాత్*
*కామానవాప్నుయాత్ కామీ ప్రజార్థీ చాప్నుయాత్ ప్రజాం*

**తాత్పర్యం** : ఈ సహస్ర నామస్తోత్రాన్ని పఠించడం వల్ల ధర్మం కోరే వారికి ధర్మం, ధనం కోరే వారికి ధనం, భోగాలు కోరే వారికి భోగాలు, సంతానం కోరే వారికి సంతానం లభిస్తాయి.

అంతేకాదు భక్తి శ్రద్ధలతో, పరిశుద్ధమైన మనస్సుతో ప్రతిదినం 'శ్రీవిష్ణు సహస్ర నామ స్తోత్ర మహామంత్రం, జపించే వారికి....

***'యశఃప్రాపోన్నతి విపులం'*** : అమితమైన కీర్తి లభిస్తుంది.
***జ్ఞాతి ప్రాధాన్యమేవచ*** : తన వారిలో పెద్దరికం సిద్ధిస్తుంది.
***అచలాంశ్రియ మాపోన్నతి*** : తరగని ఐశ్వర్యం లభిస్తుంది.
***శ్రేయఃప్రాపోన్నత్యుత్తమః*** : అమితమైన సుఖశాంతులు కలుగుతాయి.
***నభయం క్వచిదాపోన్నతి*** : ఎటువంటి భయం కలుగదు.
***వీర్యం, తేజస్ చ విందతి*** : బలపరాక్రమాలూ, తేజస్సూకూడా సిద్ధిస్తాయి.

ఇంతకు మించిన ఫలితాలు కూడా ఉన్నాయి. ఈ మహామంత్రాన్ని జపించేవారు .....

***'రోగార్తో ముచ్యతేరోగాత్'*** : రోగ పీడితులైతే ఆరోగ్యవంతులవుతారు.
***బద్ధో ముచ్యేత్ బంధనాత్*** : అకారణంగా చెరలో పడితే, బంధువిముక్తులవుతారు.
***ముచ్యేతాపన్న ఆపదః*** : కష్టాలను అనుభవిస్తున్నటయితే వాటి నుండి బయట పడతారు.

ఇంకా వ్యాసమహర్షి ఈ విధంగా అంటున్నారు.

*'న వాసుదేవ భక్తానామశుభం విద్యతేక్వచిత్*
*జన్మమృత్యు జరావ్యాధి భయం నైవోపజాయతే'*

**తాత్పర్యం** : శ్రీ వాసుదేవుని భక్తులకు 'కీడు' ఎన్నటికీ జరుగదు. వారికి పునర్జన్మ ఉండదు. వృద్ధాప్యం, వ్యాధి, అనే వాటి వల్ల కలిగే భీతి కూడా ఉండదు.

**వాసుదేవాశ్రయో మర్త్యో వాసుదేవ పరాయణః**
**సర్వపాప విశుద్ధాత్మా యాతి బ్రహ్మ సనాతనమ్**

**తాత్పర్యం** : వాసుదేవుని ఆశ్రయించిన వారు సకల పాపముల నుండి బయటపడి, పరిశుద్ధులై చివరకు పరబ్రహ్మలో లీనమవుతారు.

★ ★ ★

నిరాకారుడైన భగవంతుడు నామరూపాలు కల ప్రపంచంగా వ్యక్తం కావటం వల్ల ఆయనకు అనంతనామాలు ఏర్పడినవి. ఆ నామాలన్నీ ఆయనవే అని గ్రహించటం, ఆ రూపాలన్నీ ఆయనవిగానే భావించటం, ప్రపంచంలోనూ త్రిలోకాలలోనూ శాశ్వతంగా ఉండేది ఆయన ఒక్కడే అని స్పష్టంగా తెలుసుకోవటం అన్నదే 'జ్ఞానం'. ఆ విధమైన జ్ఞానసముపార్జనకు 'శ్రీ విష్ణుసహస్ర నామాలు' అమితంగా తోడ్పడతాయి.

దుష్ట శిక్షణ కోసం, శిష్ట రక్షణ కోసం, ధర్మ సంరక్షణ కోసం భగవంతుడు అప్పుడప్పుడూ అవతరిస్తూ ఉంటాడు. అయితే జ్ఞానులు, భక్తులు, సత్పురుషులు మున్నగు మహనీయుల రూపంలో ఎప్పుడూ వ్యక్తమవుతూఉంటాడు. వివిధ రూపాలలో వ్యక్తమయ్యే భగవత్ సృష్టిని పరిశీలించడం ద్వారా ఆ భగవత్ శక్తిని లేశమాత్రంగానైనా అర్థం చేసుకోగలం. మనకు ఆ విధమైన అవకాశాన్ని, అనుభూతిని కలిగించేవే 'శ్రీవిష్ణు సహస్రనామాలు'.

జననధర్మం గల జీవులకు (జంతువులకు) జన్మరాహిత్యాని చేకూర్చేది భగవన్నామ జపం ఒక్కటే. ఏ రూపంలో ఉన్నా, ఏ జాతికీ, కులానికీ, మతానికీ చెంది ఉన్నా, భగవన్నామాన్ని జపించే అర్హత ప్రతి ప్రాణికి ఉంది. ఆ సత్య నిరూపణకు గజేంద్రమోక్షం ప్రబల నిదర్శనం, జడభరతుని గాథ ఒక తార్కాణం. వాల్మీకి చరిత్ర ఒక ఉదాహరణం.

'జపం' మూడు రకాలుగా ఉంటుంది. పదిమందికీ వినబడేటట్లు బిగ్గరగా గొంతెత్తి చేయటం 'వైఖరి'. పెదవులు మాత్రమే కదుపుతూ పైకి వినబడకుండా చేసేది 'పాంశువు'. మనకు మనం లోలోపల చేసేది 'మానసికం.'

శ్రీ విష్ణుసహస్రనామ మహామంత్ర జపంపై మూడు విధాలుగా చేసుకోవచ్చు. ఎవరికి ఎప్పుడు ఎలా వీలు పడితే అలా చేసుకోవచ్చు.

ఏ నామాన్ని మననం చేసుకోవటం ద్వారా మానవులు జనన మరణ రూపమైన సంసార సాగరాన్ని తరిస్తారో, ఆ దివ్య నామాన్ని 'మంత్రం' అంటారు.

" ఈ సహస్ర నామాలలో ప్రతి నామము ఒక మంత్రమే. వీటిలో ఏ ఒక్క నామాన్ని జపించినా ధన్యత్వం సిద్ధించి తీరుతుంది" అని అంటారు శ్రీ పరాశరభట్టాచార్యులు."

"గేయం గీతా నామ సహస్రం" అన్న శంకర భగవత్పాదుల సందేశ వాక్యం భగవద్గీతకూ, విష్ణు సహస్రనామాలకూ భారతీయ భక్తి వాఙ్మయంలో ఉన్న ప్రాధాన్యాన్ని సూచిస్తుంది.

భగవద్గీత, సహస్రనామాలు రెండూ వ్యాసభారతంలోనే ఉన్నాయి. భీష్మ పర్వంలో భారతయుద్ధానికి పూర్వరంగంగా గీతోపదేశం జరిగితే, భారత యుద్ధం ముగిసిన తరువాత అనుశాసన పర్వంలో సహస్రనామ సంకీర్తనం జరిగింది.

భగవంతుని బాంధవ్యం, సఖ్యం, సౌహార్ధమే కాక, ఆయన సారథ్యం కూడా సంపాదంచుకొన్న ధన్యజీవి ధనంజయుడు (అర్జునుడు). అతడు మమతకు లోబడి జవసత్వాలను కోల్పోతున్న సమయంలో అతనిలో కర్మ పరాయణత్వాన్ని, ధర్మనిరతిని, సమదృష్టిని, సమరావేశాన్ని కల్పించేందుకు సాక్షాత్ శ్రీ కృష్ణ పరమాత్మ ప్రసాదించిన భవ్యసందేశం భగవద్గీత.

భారత యుద్ధం ముగిసిన తరువాత ధర్మనందనుని ధర్మ జిజ్ఞాసకు సమాధానంగా పరమశాంతి నిధానుడైన భీష్మాచార్యులు వినిపించిన దివ్యనామ సహస్రం – శ్రీవిష్ణు సహస్రనామం.

గీతకంటే సహస్రనామం సులభమైన తరుణోపాయాన్ని సూచిస్తుంది. భగవద్గీతలోని ప్రతిశ్లోకం, ప్రతి పదం జాగ్రత్తగా పరిశీలించి బోధపర్చుకొని కార్యరూపంలో దాని అనుసరిస్తేనే గీతాధ్యయనానికి నిజమైన ప్రయోజనం చేకూరుతుంది. కాని సహస్రనామం స్మరణ మాత్రం చేత తరింపజేస్తుంది.

*యస్యస్మరణ మాత్రేణ జన్మసంసార బంధనాత్*
*విముచ్యతే నమస్తస్మై విష్ణవే ప్రభవిష్ణవే*

**తాత్పర్యం :** ఎవరిని తలచినంత మాత్రాన్నే సంసార బంధనాలు, జన్మ పరంపరలు వదలిపోతున్నాయో అటువంటి ప్రతిభావంతుడైన విష్ణు దేవునకు నమస్కారం.

కృతయుగంలో ధ్యానం, త్రేతాయుగంలో యజ్ఞయాగాదులు, ద్వాపర యుగంలో అర్చన, కలియుగంలో కేశవనామ సంకీర్తన తరుణోపాయాలని విష్ణు పురాణం చెప్తుంది.

నవ విధ భక్తిలోని మొదటి మూడు మార్గాలు శ్రవణం, కీర్తనం, స్మరణం – కూడా నామ మహిమనే చాటి చెప్తాయి. వీటిలో మూడవ మార్గమైన స్మరణాన్ని గురించి చెప్తూ 'విష్ణోస్మరణం' అని సూటిగా విష్ణుసహస్రనామాలనే సూచిస్తుంది భాగవత పురాణం.

★ ★ ★

సహస్రనామాలలోని ప్రతి నామానికి అర్థం తెలియక పోయినా స్పష్టంగా ఉచ్ఛరించగలిగితే చాలు. స్పష్టాక్షరమైన పలుకే మంత్రం. దీనికి అధీనులే దేవతలు. అందకనే మెలకువగా, అప్రమత్తతతో, సతతోత్థితులై భక్తితో నామస్మరణ చేయాలంటాడు భీష్ముడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Sri+Vishnu+Sahasranama+Stotram+Tika+Tatparya+Sahitam**

* * *